చెత్త కుప్పలు.. ముప్పతిప్పలు

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- రోడ్లవెంట పేరుకు పోయిన చెత్త
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- దృష్టి సారించని పంచాయతీ అధికారులు



పడిదెంపాడు ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



నందనపల్లె సమీపంలో ఓ ఫంక్షన్ హాలు వద్ద పందుల విహారం



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీ

కర్నూలు(రూరల్): అధికారుల అలసత్వం కారణంగా స్వచ్ఛ భారత్ లక్ష్యం నెరవేరడం లేదు. పేరుకే స్వచ్ఛ భారత్ నినాదం.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధం. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు పలుకుతున్నారు. కేవలం మూడో శనివారాలు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ పేరుతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలతోనే సరిపెడుతున్నారని, కొన్ని చోట్ల చెత్తను శుభ్రపరిచినట్లు ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారని, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడంలేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎక్కడ చూసినా చెత్తకుప్పలే..

కర్నూలు మండలం పరిధిలోని నందనపల్లె, దిన్నెదేవరపాడు, ఈ.తాండ్రపాడు, జి.సింగవరం, పడిదెంపాడు, శివరామపురం, సుంకేసుల గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. రోడ్లపైనే చెత్తదిబ్బలు రోజుల తరబడి అలానే ఉండడంతోనే దుర్వాసన వ్యాపిస్తోంది. కడుపు తిప్పే దుర్గంధంతోనే సహజీవనం చేస్తూ ప్రజలు ఇబ్బందులు పాడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని గ్రామీణులు కోరుతున్నారు.

హిందువులపై దాడులు వ్యతిరేకించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించడం పేరుతో బెంగాల్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఫలితంగా బెంగాల్ మొత్తం హింసాకాండతో రగిలిపోతోందన్నారు. హిందూ మత వ్యతిరేకులు విచ్చలవిడిగా దాడులను ప్రారంభించారన్నారు. ముర్షిదాబాద్‌లో ప్రారంభమైనీ భయంకరమైన హింస బెంగాల్ మొత్తం వ్యాపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సంపర్క కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు సందడి మహేష్, నాగరాజు, సాయిరాం, బజరంగ్‌దళ్ నాయకులు జంపాల నవీన్, హరికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు.

పోలీస్ స్టేషన్‌లో ప్రశ్న పత్రాలు

సి.బెళగల్: మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రాలు శనివారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. ప్రశ్న పత్రాలను రూట్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చగా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పరీక్షల నిర్వహణ అధికారి వంశీమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది వాటిని హెడ్‌కానిస్టేబుల్ తమ్మప్ప ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 21న స్థానిక మోడల్ స్కూల్ పరీక్షలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వేపై మండల రెవెన్యూ అధికారులు గ్రామంలో శనివారం గ్రామ సభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆధ్వర్యంలో మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభను ఏర్పాటు చేసి సర్వే వివరాలను వెల్లడించారు. అనంతరం అక్కడి నుంచి బస్టాండ్ వరకు వీఆర్వోలు, సచివాలయ సర్వే సహాయకులు, వీఆర్ఏలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సి.బెళగల్: గర్భిణులు, బాలింతలు, బాలికలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని కోడుమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ వరలక్ష్మీదేవమ్మ అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పోషణ్ పఖ్వాడా కార్యక్రమంపై సి.బెళగల్లోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలను నిర్వహించారు. కాగా కార్యక్రమానికి వచ్చిన వారికి కనీసం కుర్చీలు లేకుండా నేలపై కూర్చబెట్టడంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడ్డారు.

తప్పిన ప్రమాదం

పాణ్యం : మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం కర్నూలు వైపు నుంచి నంద్యాలకు వెళ్తున్న కారు పాణ్యం బస్టాండ్ వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ఒక్కసారిగా హైవే నుంచి బ్రిడ్జి కిందకు కంప పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. రెండు వాహనాలు మాత్రం దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు.

సమయపాలన పాటించండి



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కిరణ్‌కు సూచించారు. అలాగే ఆసుపత్రిలోని టీబీ రికార్డులను పరిశీలించి రోగులకు ఎప్పటికప్పుడు మందులను అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్టు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ

ఓర్వకల్లు: రైతులు సాగుచేసిన పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై హుసేనాపురం రైతు సేవా కేంద్రంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా. శివరామకృష్ణ, డా. అశోక్‌కుమార్, డా. పుల్లిబాయి హాజరై మాట్లాడారు. వేసవి కాలంలో పత్తి పంట వేయడం మంచిది కాదని రైతులకు సూచించారు. దీనివల్ల గులాబీ రంగు పురుగు ఎక్కువగా ఆశించే ఆస్కారం ఉందని తెలిపారు. పత్తిలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు కాటినేని నారాయణ, సుధాకర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది గంగాధర్, భువనేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంతో సుస్థిర సంపద

ఓర్వకల్లు: పండ్ల తోటల పెంపకం ద్వారా సుస్థిర సంపద సాధించవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని కొమరోలు గ్రామంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఐదెకరాలలోపు చిన్న సన్నకారు రైతులకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ పండ్ల రకాల మొక్కలను వందశాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అంతేగాక రైతులు తమ పొలాల్లో నీటి కుంటను కూడా తవ్వించుకోవచ్చన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్రలో భాగంగా విద్యుత్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, గ్రామ సర్పంచు రామచంద్రుడు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



విద్యుత్ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గ్యాస్ వినియోగంపై అవగాహన అవసరం

కోడుమూరు రూరల్: గ్యాస్ వినియోగంపై విద్యార్థులంతా తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై కోడుమూరులోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు శనివారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం నివాసిత ప్రాంతాల్లో గ్యాస్ వల్ల కలిగే ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకరిని ఒకరు తోసుకోకుండా, లిఫ్ట్‌ను ఉపయోగించకుండా మెట్ల మార్గం ద్వారానే బయటకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సత్యం, రఘురాముడు, వీరాంజనేయులు, మల్లికార్జున, దివాకర్ రెడ్డి, బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మిరప మండిపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

ఆశలు వర్షార్పణం!

పాణ్యం: అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు తడిసిముద్దయ్యాయి. మండలంలో రబీలో సాగు చేసిన వరి, ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప దిగుబడులను రైతులు కల్లాల్లో ఆరబెట్టారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వీచిన గాలులు, వానకు ఆ దిగుబడులన్నీ నీటిమయం అయ్యాయి. అప్పటికప్పుడు పట్టలు కప్పి కాపాడుకునేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. కొండజుటూరు, గోరుకల్లు, పాణ్యం, ఆలమూరు, కొనిదేడు గ్రామాల్లో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భూపనపాడు గ్రామంలో మిరప మంట నీటిపాలైంది. శనివారం ఆయా పంట ఉత్పత్తులను చూసి రైతులు కన్నీళ్లు పెట్టారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన పండించిన పంట చివరకు నీటిపాలైందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



తడిసిన మిరపను ఆరబెడుతున్న రైతు

గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందాం



పాణ్యంలో మాట్లాడుతున్న డీపీఓ జమీవుల్లా



చెక్‌పోస్టు వద్ద జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కోడుమూరులో పంచాయతీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ, గ్రామ సర్పంచు

పాణ్యం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ ముందుకురావాలని డీపీఓ జమివుల్లా అన్నారు. శనివారం బలపనూరు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, ఏఓ జయప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి సరోజిని దేవి తదితరులు పాల్గొన్నారు.

- గోనవరం గ్రామంలో ఎస్సీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యుడు దానం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటి వెళ్లి తడ, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.
- పాణ్యంలో సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ ఆనందరావు ఆధ్వర్యంలో ఈ- వెస్టేజ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ వ్యర్థాలను తగ్గిద్దాం

కల్లూరు: ఈ- వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి వాటి శాస్త్రీయ నిర్వహణను ప్రోత్సహిద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కల్లూరు అర్బన్ 20వ వార్డు నంద్యాల చెక్‌పోస్టులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

- ఎ.గోకులపాడు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ (మండల ప్రత్యేక అధికారి) వేణుగోపాల్ హాజరయ్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డి నాగేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

సి.బెళగల్: గ్రామాల పరిశుభ్రతపై ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ మండల అధికారులు, గ్రామ సర్పంచ్ పాండురంగన్న తదితరులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొదుపు మహిళలను సమావేశ పరచి అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం ఎదుట రోడ్డుపై మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారులలో చెత్త తొలగింపు పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, వెలుగు ఏపీఎం రామేశ్వర్, సీసీలు, ఆశా వర్కర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ఓర్వకల్లు: పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం స్థానిక సచివాలయం వద్ద పంచాయతీ కార్మికులు మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గోవిందరెడ్డి, అయూబ్‌బాషా, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను జాగ్రత్తగా సేకరించాలి

కోడుమూరు రూరల్ : పర్యావరణానికి హానికరంగా మారిన ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలను జాగ్రత్తగా సేకరించాలని ఎంపీడీఓ రాముడు పంచాయతీ సిబ్బందికి సూచించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ రాముడు, గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఈఓ అజయ్ భాస్కర్‌లు పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు మాదులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో ..

గూడూరులోను శనివారం మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు, మండల అధికారులు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ రమేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థి పేరు	సాధించిన పర్సంటైల్	ఆల్ ఇండియా ర్యాంక్	ఆల్ ఇండియా కేటగిరి ర్యాంక్
ఎరుకుల రాజు	93. 84	92129	771
ఎ. నవీన్	97.61	36422	1020
కె.రామ్ మనోహర్	96.81	59323	1943
బి.నానాజీ నాయక్	87.8	180216	2029



వై.రాజు , ఎ.నవీన్, కె.రామ్ మనోహర్ ,బి.నానాజీ నాయక్

కల్లూరు: జేఈఈ మెయిన్స్ ఫేస్-2 ఫలితాల్లో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. అకాడమి నుంచి మొత్తం 65 మంది విద్యార్థుల్లో 61 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025కు అర్హత సాధించినట్లు అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప శనివారం తెలిపారు. ప్రభుత్వ సౌకర్యాలు, విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వంతో మంచి ఫలితాలు సాధించారని ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త శ్రీదేవి తెలిపారు.

ఘనంగా రన్‌ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్‌ను ప్రారంభిస్తున్న పాస్టర్లు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. షాలేము ప్రార్థన మందిరం నుంచి బస్టాండ్ వరకు ఈకార్యక్రమం జరిగింది. పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ రన్ ఫర్ జీసస్ ప్రాముఖ్యతను వివరించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని క్రైస్తవులకు సూచించారు. కార్యక్రమంలో పాస్టర్లు పురుషోత్తం, సుందర్, డెవిడ్, సుమిత్రబాయి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 39,008 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేస్తానని సంతకం చేసి పది నెలలు గడిచినా నోటిఫికేషన్ మాత్రం ఇవ్వలేదన్నారు. డీఎస్సీ కోసం ప్రిపరేషన్ అయ్యే నిరుద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వం 39 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

పోషకాహార భారత్‌ను నిర్మించడమే లక్ష్యం

కర్నూలు(అర్బన్): పోషకాహార భారత్‌ను నిర్మించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ 2025 కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ, క్షేత్ర ప్రచార సహాయకులు ఫణికుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పోషణ్ పక్వాడ కార్యక్రమాల్లో భాగంగా శనివారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఐసీడీఎస్ సంయుక్తంగా స్థానిక నిర్మాలానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ అభియాన్ శిశువు జీవితంలోని మొదటి 1000 రోజుల పౌష్టికాహారం ప్రాముఖ్యతను, పోషణ్ ట్రాకర్ ఉపయోగాన్ని వివరించారు. కార్యక్రమంలోనే భాగంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అలాగే గర్భిణులకు సీమంతాలు, పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.